క్లుప్తంగా

నేడు భారీ బైక్ ర్యాలీ

ఉదయగిరి: ఉదయగిరి వైఎస్సార్‌సీపీ యువత ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం ఐదు గంటలకు భారీ బైక్ ర్యాలీ జరుగుతుందని ఆ పార్టీ మండల కన్వీనర్ గానుగపెంట ఓబుల్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, వేణుంబాక విజయసాయిరెడ్డి, సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ నిర్వహించే బైక్ ర్యాలీలో ముఖ్య అతిథిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తనయుడు మేకపాటి అభినవ్‌రెడ్డి పాల్గొంటారన్నారు. ఈ ర్యాలీ మేకపాటి గౌతమ్‌రెడ్డి వ్యవసాయ కళాశాల వద్ద నుంచి బయలుదేరి మెయిన్‌రోడ్డు ట్యాంక్‌బండ్ మీదుగా వైఎస్సార్ విగ్రహం వద్దకు చేరుకుంటుందన్నారు. అక్కడ సమావేశం అనంతరం డిన్నర్ కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, యువకులు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

అభ్యర్థులు ఖర్చులు పక్కాగా చూపించాలి

- ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్



మాట్లాడుతున్న ఆర్వో రాజారమేష్ ప్రేమ్‌కుమార్

ఉదయగిరి: ఉదయగిరి అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల బరిలో ఉన్న వివిధ పార్టీల అభ్యర్థులు రోజువారీ ఖర్చుల వివరాలను పక్కాగా నిర్వహించాలని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.రాజారమేష్ ప్రేమ్‌కుమార్ తెలిపారు. ఆయన మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో పోటీలో ఉన్న అభ్యర్థుల ప్రతినిధులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులు రోజు వారీ ఖర్చుల వివరాలను పక్కాగా నమోదు చేస్తుండాలన్నారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఖర్చు పెట్టాలన్నారు. ఖర్చుల వివరాలపై వ్యయపరిశీలకులు తనిఖీలు చేపడతారన్నారు. ఖర్చుల విషయంలో జాగ్రత్తలు పాటించాలన్నారు. రూ.10 వేల లోపు ఖర్చుకు సంబంధించి నగదు చెల్లించవచ్చన్నారు. రూ.10 వేలు పైబడితే అకౌంట్ పే చెక్ ద్వారా చెల్లించాలన్నారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలన్నారు.

చుక్కల దుప్పిని కాపాడిన యువకులు



దుప్పిని అటవీ ప్రాంతంలో వదిలిన సిబ్బంది

ఉదయగిరి: తాగునీటి కోసం జనారణ్యంలోకి వచ్చిన ఓ చుక్కల దుప్పిని కుక్కలు చుట్టుముట్టడంతో వాటి బారి నుంచి యువకులు రక్షించి అటవీశాఖ అధికారులకు అప్పగించారు. పట్టణంలోని దేవలాలగడ్డలోకి అటవీ ప్రాంతం నుంచి చుక్కల దుప్పి జనారణ్యంలోకి వచ్చింది. దుప్పిని చూసిన కుక్కలు వెంటాడి గాయపరిచాయి. గమనించిన యువకులు దుప్పిని రక్షించి అటవీశాఖ రేంజ్ అధికారి తుమ్మల ఉమామహేశ్వరరెడ్డికి సమాచారం అందించారు. ఆయన వెంటనే సిబ్బందిని పంపి దుప్పిని స్వాధీనం చేసుకొని పశువైద్యశాలకు తరలించి చికిత్స అనంతరం దుర్గం అటవీ ప్రాంతంలో దుప్పిని వదిలేశారు. ఈ కార్యక్రమంలో ఏబీఓ వెంకటేశ్వర్లు, ఎఫ్‌బీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

కొనసాగుతున్న వలంటీర్ల రాజీనామా



సచివాలయ సిబ్బందికి రాజీనామా పత్రాలు అందిస్తున్న వలంటీర్లు

సీతారామపురం: మండలంలోని అయ్యవారిపల్లి సచివాలయ పరిధిలో పోలంగారిపల్లిలో ఐదుగురు, బాలాయపల్లి సచివాలయ పరిధిలోని దేవమ్మచెరువులో ముగ్గురు వలంటీర్లు మంగళవారం స్వచ్ఛందంగా రాజీనామా చేశారు. వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన అధినేతలు వలంటీర్ల మనోభావాలు దెబ్బతినే విధంగా వ్యవహరించినందుకు నిరసనగా తాము రాజీనామా చేశామన్నారు. స్థానిక వైఎస్సార్‌సీపీ మండల నాయకుల ఆధ్వర్యంలో ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు విజయసాయిరెడ్డి, రాజగోపాల్‌రెడ్డి విజయం కోసం పని చేస్తామన్నారు.

నేడు శ్రీనివాసుని కల్యాణం

ఉదయగిరి: మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద కొలువైన సిద్ధేశ్వర, పరమేశ్వర ఆలయ ప్రాంగణంలో బుధవారం లోక కల్యాణార్థం శ్రీదేవి,భూదేవి సమేత శ్రీనివాసుని కల్యాణ మహోత్సవం జరుగుతుందని గ్రామ భక్తబృందం, ప్రాజెక్టు సిబ్బంది మంగళవారం ప్రకటనలో తెలిపారు. కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తిలకించి స్వామి వారి కృపకు పాత్రులు కావాలని కోరారు.

అస్త్రసన్యాసం దిశగా కావ్య

- డబ్బులు లేవంటూ నేతలు, కార్యకర్తలకు మొహం చాటేస్తున్న వైనం
- నామినేషన్ రోజు నుంచే ప్రచారానికి విముఖత
- టీడీపీ రెబల్ అభ్యర్థిగా పసుపులేటికి జైకొడుతున్న కేడర్
- ఉక్కిరిబిక్కిరి అవుతున్న కావ్య

కావలిలో రాజకీయ సమీకరణాలు మారాయి. టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నువ్వే అంటూ పసుపులేటి సుధాకర్‌కు ఆ పార్టీల కేడర్ జైకొడుతోంది. టీడీపీ అభ్యర్థిగా బరిలో ఉన్న కావ్య కృష్ణారెడ్డి అస్త్రసన్యాసం చేయాల్సిన పరిస్థితి అనివార్యమవుతోంది. కావ్య రౌడీ రాజకీయ వైఖరి, వివాదాస్పద వ్యాఖ్యలతో పాటు ఎలక్షన్ అంతా తన గుమాస్తాలకే అప్పగించారు. టీడీపీ ఆవిర్భావం నుంచి లీడర్లు, క్యాడర్లుగా ఉన్న వారందరిని పక్కన పెట్టేశారు. కొందరిని అయితే అవమానాలకు గురి చేస్తున్న పరిస్థితి. ఒక్క టీడీపీలోని కేడర్‌నే కాకుండా జనసేన, బీజేపీ నేతలను సైతం అదే విధంగా చేయడంతో ఇష్టం లేని వారంతా వైఎస్సార్‌సీపీలో చేరిపోయారు. ఆది నుంచి టీడీపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతానంటూ ప్రచారం చేసుకున్న పసుపులేటికి టికెట్ ఇవ్వకపోవడంతో రెబల్‌గా బరిలోకి దిగారు. ఆయనకు జనసేన గుర్తు 'గాజు గ్లాసు' కేటాయించడంతో ఉమ్మడి పార్టీల నేతలు పసుపులేటికి జైకొడుతున్నారు.



కావలి: టీడీపీ కావలి అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి నామినేషన్ల రోజునే బరి నుంచి తప్పుకున్నట్లుగా కనిపిస్తోంది. తాజా పరిణామాలతో రాజకీయ అస్త్రసన్యాసం తప్పదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. పోలింగ్ తేదీ దగ్గరపడే కొద్దీ ఎవరైనా ప్రచారంలో దూకుడు పెంచుతారు. వ్యూహ ప్రతివ్యూహాలతో ఓటర్లను ఆకట్టుకునేందుకు శ్రమిస్తారు. అయితే కావ్య మాత్రం డబ్బులు లేవనే సాకుతో కార్యకర్తలకు మొహం చాటేస్తూ అస్త్రసన్యాసం దిశగా అడుగులు వేస్తున్నాడు. నామినేషన్ రోజే గెలుపును నిర్ణయిస్తానని ఉత్తర కుమారుడి ప్రగల్భాలు పలికిన కావ్య చివరకు ఒంటరిగానే నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు రోజు నుంచే కావ్య వైఖరి పూర్తిగా మారిపోవడంతో కేడర్ నీరుగారిపోయింది.

మా ఉమ్మడి అభ్యర్థి నువ్వే 'పసుపులేటి'

టీడీపీ టికెట్ ఆశించి చివరి వరకు ప్రయత్నం చేసిన పసుపులేటి రెబల్‌గా పోటీలో దిగారు. అయితే ఆయనకు జనసేన గుర్తు 'గాజు గ్లాసు' కేటాయించడంతో కావలిలో రాజకీయ పరిణామాలు అనూహ్యంగా మారిపోయాయి. నిన్నటి వరకు ఉమ్మడి అభ్యర్థి కోసం ఇష్టం లేకపోయినా.. కావ్య వెంట తిరుగుతున్న కేడర్ మొత్తం ఒక్కసారిగా మా ఉమ్మడి అభ్యర్థి పసుపులేటి సుధాకర్ అంటూ ప్రచారం మొదలు పెట్టారు. 2019 ఎన్నికలకు ముందు బీసీల ప్రతినిధినంటూ రాజకీయ ఆరంగేట్రం చేశారు. 2019 ఎన్నికల్లో జనసేన అభ్యర్థిగా పోటీ చేసి 10,647 ఓట్లు తెచ్చుకున్నారు. ఆ తర్వాత కొద్ది నెలలకే బీజేపీలో చేరారు. మళ్లీ కొంత కాలం తర్వాత టీడీపీలో అధికారికంగా చేరకపోయినప్పటికీ తానే టీడీపీ అభ్యర్థినవుతానంటూ ప్రచారం చేసుకున్నారు. ఈ క్రమంలో చంద్రబాబు పసుపులేటిని పిలిపించుకుని పార్టీని పటిష్టం చేయాలని కోరడంతో పనిచేసుకుంటూ వచ్చారు. స్కిల్ స్కామ్‌లో చంద్రబాబు అరెస్ట్ అయి జైల్లో ఉండగా నిరసన ర్యాలీలు నిర్వహించారు. దాదాపుగా టీడీపీ అభ్యర్థిగా పసుపులేటి ఉంటారని భావిస్తున్న తరుణంలో కావ్య తెరపైకి వచ్చారు. దీంతో తీవ్ర అసంతృప్తితో పసుపులేటి సుధాకర్ రెబల్‌గా పోటీలోకి దిగారు. ఆయనకు గాజు గ్లాసు గుర్తు రావడంతో కావ్యను వ్యతిరేకిస్తున్న మూడు పార్టీల్లోని కేడర్ పసుపులేటికి మద్దతు పలుకుతోంది. పసుపులేటి శిబిరం కళకళలాడుతుంటే.. కావ్య శిబిరం వెలవెలబోయింది.

కావ్య కొంప ముంచిన పసుపులేటి

పసుపులేటి సుధాకర్ టీడీపీ రెబల్‌గా పోటీ చేసినప్పటి నుంచి టీడీపీ కేడర్‌ను తన వైపు తిప్పుకునేందుకు ప్రయత్నాలు చేశారు. తనకు గాజు గ్లాసు గుర్తు రావడంతో తానే ఉమ్మడి అభ్యర్థినంటూ మరో వైపు పసుపులేటి ఎన్నికల ప్రచారాన్ని ఉధృతం చేశారు. కావ్య అహంకార పూరిత వైఖరి ఇప్పుడు అతన్ని నిలువెల్లా ముంచేసిందని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. టీడీపీ టికెట్ దక్కించుకున్నప్పటి నుంచి కావ్య మూడు పార్టీల కేడర్ మొత్తం తన గుప్పెట్లో ఉండాలనే విధంగా వ్యవహరించారు. బీజేపీ, జనసేన లీడర్లను అయితే టీడీపీ కండువా కప్పుకోవాలంటూ బెదిరింపులకు దిగారు. ప్రచారానికి మాత్రం తమను వాడుకుంటూ ఆర్థిక లావాదేవీలన్నీ కూడా తన గుమాస్తాలకే కట్టబెట్టడాన్ని టీడీపీ, జనసేన, బీజేపీ కేడర్ జీర్ణించుకోలేకపోయింది. దీంతో వారంతా ఒక్కొక్కరుగా సైడ్ అయిపోయారు. ఇదే అదనుగా పసుపులేటి ఆ వర్గాలను తనకు అనుకూలంగా మలుచుకునేందుకు ప్రయత్నించారు. ఎప్పటికైనా తనకు పక్కలో బల్లెం అవుతాడని అప్రమత్తంగా ఉండని కావ్య కొంప పసుపులేటి ముంచేశాడని ప్రచారం జరుగుతోంది. పసుపులేటిని బుజ్జగించుకుని తన వైపు తిప్పుకుని ఉంటే.. కావ్య కొంత బలపడే అవకాశం ఉండేది. ఇప్పుడు ఆ అవకాశం కూడా జారిపోవడంతో దిక్కుతోచక ఉక్కిరిబిక్కిరి అవుతున్నాడు. దీంతో పసుపులేటి ఒక 420 అంటూ కావ్య అక్కసు కక్కుతున్నాడు. కావ్యకు జరగాల్సిన శాస్తి జరిగిదంటూ టీడీపీ నేతలు సంబరపడిపోతున్నారు.

నేటి నుంచి పింఛన్ల పంపిణీ

వరికుంటపాడు: వరికుంటపాడు, ఉదయగిరి మండలాల్లో బుధవారం నుంచి ఈ నెల 5వ తేదీ వరకు సచివాలయాల పరిధిలో వివిధ రకాల పింఛన్లను డోర్ టు డోర్, బ్యాంక్ అకౌంట్ ద్వారా పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఓలు తోట వెంకట కృష్ణకుమారి, డి.ఈశ్వరమ్మ మంగళవారం తెలిపారు. వరికుంటపాడు మండలంలో 4,359 పింఛన్లు ఉండగా అందులో 1,142 డోర్ టు డోర్ పద్ధతిన, 3,217 బ్యాంకు ఖాతా ద్వారా చెల్లిస్తామన్నారు. ఉదయగిరిలో 4,971 పింఛన్లు ఉండగా, 1,363 డోర్ టు డోర్ ద్వారా, 3,608 బ్యాంక్ అకౌంట్ ద్వారా ప్రభుత్వ ఎన్నికల కమిషనర్ ఆదేశాల మేరకు చెల్లింపులు జరుగుతాయన్నారు.

నేడు విజయసంకల్పయాత్ర

కలిగిరి: మండలంలోని వెలగపాడు, తెల్లపాడు పంచాయతీల్లో గురువారం ఉదయగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో విజయ సంకల్పయాత్ర నిర్వహించబడుతాయని జెడ్పీటీసీ సభ్యుడు పాలూరు మాల్యాద్రిరెడ్డి, వైఎస్సార్‌సీపీ కాటం రవీంద్రారెడ్డి బుధవారం తెలిపారు. మధ్యాహ్నం 4 గంటలకు వెలగపాడు, సాయంత్రం 6 గంటల నుంచి తెల్లపాడు పంచాయతీల్లో ప్రారంభమయ్యే ఈ కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే ఎన్నికల ప్రచారం నేడు

బిట్రగుంట: బోగోలు మండలం జువ్వలదిన్నెలో కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మద్దిబోయిన వీరరఘు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డితో కలిసి సాయంత్రం 4 గంటలకు ప్రచారం ప్రారంభిస్తారన్నారు. నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

టీడీపీలోనే 420లు పుట్టింది..



కావలి: భారీ జనసందోహంతో ఎన్నికల ప్రచారం



కావలి: ప్రజలకు అభివాదం చేస్తున్న విజయసాయిరెడ్డి, ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఉదయగిరి నుంచి సూళ్లూరుపేట వరకు కావ్య మోసాలు
- ప్రజాక్షేత్రంలో సరైన గుణపాఠం తప్పదు
- కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: టీడీపీ ఒక 420 పార్టీ.. 420లు పుట్టేదే టీడీపీలోనే అంటూ కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్ కుమార్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డి 420 అని, ఆయన జీవితమంతా మోసాలు, వంచనలు, దోపిడీలు, దారుణాలతో మూడి పడి ఉందని మండిపడ్డారు. ఎవరు 420లో, ఎవరు ప్రజానాయకులో కావలి ప్రజలకు తెలుసన్నారు. కావ్య కృష్ణారెడ్డి అక్రమాలు, మోసాలు ఉదయగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర సరిహద్దుల్లోని సూళ్లూరుపేట చెంగాళమ్మ గుడి భూముల వరకూ పాకాయన్నారు. నయవంచకులు, మోసగాళ్లు, నేరచరితులకు నిలయంగా మారిన టీడీపీని రానున్న ఎన్నికల్లో ప్రజలు బంగాళాఖాతంలో కలిపేందుకు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కావలి పట్టణంలోని 10,11,12వ వార్డుల్లో ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డితో కలిసి ఎమ్మెల్యే ప్రతాప్ కుమార్ రెడ్డి మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు కనీవినీ ఎరుగని రీతిలో స్వాగతం పలికారు. భారీ గజమాలలతో పాటు స్థానిక వ్యాపారులు ఆపిల్, పైనాపిల్, వివిధ రకాల ఇతర పండ్లతో తయారు చేసిన భారీ పండ్ల గజమాలలతో స్వాగతం పలికి అడుగడుగునా పూలవర్షం కురిపించారు. మహిళలు మంగళహారతులతో దీవెనలందించారు. ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్ రెడ్డి మాట్లాడుతూ కావలి టీడీపీ అభ్యర్థి కావ్య కృష్ణారెడ్డిపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. పదేపదే తనపై కేసులు ఉన్నాయని ఆరోపిస్తున్న కావ్య కృష్ణారెడ్డి ఉదయగిరి నియోజకవర్గం నుంచి రాష్ట్ర సరిహద్దుల్లోని చెంగాళమ్మ ఆలయ భూముల వరకూ అక్రమాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఉదయగిరి నియోజకవర్గంలో అక్రమ కంకర క్వారీలతో సహజ వనరులను, ప్రభుత్వ సంపదను కొల్లగొట్టడంతో పాటు చెంగాళమ్మ ఆలయ భూముల్లో ప్లాట్లు వేసి అమాయకులను మోసం చేశాడని ఆరోపించారు. తనపై ఉన్న కేసులన్నీ టీడీపీ ప్రభుత్వ హయంలో ఉద్దేశపూర్వకంగా పెట్టిన కేసులేనని స్పష్టం చేశారు. చివరకు గుడిలో దైవదర్శనం చేసుకుంటున్నా కూడా ఎన్నికల ప్రచారం చేస్తున్నానని తప్పుడు కేసులు పెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినట్లు కానీ, ప్రజలను, ప్రభుత్వాన్ని మోసం చేసినట్లు కానీ తనపై ఒక్క కేసు కూడా లేదని చాలెంజ్ చేశారు. ప్రజాదరణ లేక ఫ్రస్ట్రేషన్‌లో కావ్య కృష్ణారెడ్డి నోటికొచ్చినట్లు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. కావలిలో జరుగుతున్న ఎన్నికల్లో సంస్కారానికి, అహంకారానికి మధ్యే పోటీ అని తెలిపారు. అక్రమ సంపాదనతో అహంకార పూరితంగా వ్యవహరిస్తున్న కావ్యని ప్రజాక్షేత్రంలో ప్రజలే తరిమి తరిమికొట్టే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. మే 13న జరగనున్న ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటేయడం ద్వారా కావలి ఎమ్మెల్యేగా తనను, నెల్లూరు ఎంపీగా విజయసాయిరెడ్డిని అత్యధిక మెజారిటీతో గెలిపించి టీడీపీకి తగిన గుణపాఠం చెప్పాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి మన్నెమాల సుకుమార్ రెడ్డి, నాయకులు కుందుర్తి శ్రీనివాసులు, కుందుర్తి కామయ్య, సునీత, కసుకుర్తి సుబ్బారావు, ఆత్మకూరు రాజేష్, ధన్యాసి రంగయ్య, అక్కిలిగుంట మాల్యాద్రి, చేవూరి కిరణ్ కుమార్, కేతిరెడ్డి శివకుమార్ రెడ్డి, కసుమర్లపూడి వెంకట నారాయణ, కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో 20 టీడీపీ కుటుంబాలు చేరిక



అభినవ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ శ్రేణులు

సీతారామపురం: సీతారామపురం మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం సీతారామపురం గ్రామానికి చెందిన టీడీపీ మద్దతుదారులైన ఇరవై కుటుంబాలు మేకపాటి అభినవ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. స్థానిక బంగారు, వస్త్ర వ్యాపారులైన ఆర్య, వైశ్య ప్రముఖులు కారంశెట్టి ఉమామహేశ్వరరావు, సొల్లేటి సురేంద్ర కూడా వైఎస్సార్‌సీపీలో చేరారు. వారందరికీ అభినవ్‌రెడ్డి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ త్వరలోజరిగే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు అత్యధిక మెజారిటీతో విజయం సాధించేందుకు తాము శక్తివంచన లేకుండా కృషి చేస్తామన్నారు. అనంతరం ఆర్య వైశ్యులు మహేష్ మేకపాటి అభినవ్‌రెడ్డితో పాటు స్థానిక నాయకులు గురవారెడ్డి, అల్లూరురాజు, సుబ్బారెడ్డిలను ఘనంగా సన్మానించి సత్కరించారు.

50 ముస్లిం కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరిక



కావలి: వైఎస్సార్‌సీసీలో చేరిన కావలి పట్టణ 3వ వార్డు ముస్లింలు



అల్లూరు: వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి కండువాలను కప్పిన విష్ణువర్ధన్‌రెడ్డి

కావలి: పట్టణంలోని 3వ వార్డు చెందిన టీడీపీ నాయకుడు షేక్ మున్నా ఆధ్వర్యంలో టీడీపీకి చెందిన 30 కుటుంబాలు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి నివాసంలో వైఎస్సార్‌సీపీలో చేరాయి. వారికి వైఎస్సార్‌సీపీ నేత కాటంరెడ్డి విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీశైలం దేవస్థాన పాలక మండలి సభ్యులు కేతిరెడ్డి జగదీశ్వర్ రెడ్డి, 3వ వార్డు వైఎస్సార్ సీపీ ఇంఛార్జ్ మండలి కృష్ణా రావు, వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముస్లింలు మాట్లాడుతూ జగనన్న చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై పార్టీలో చేరుతున్నామన్నారు. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డిని గెలిపించుకునేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు.

20 కుటుంబాలు వైఎస్సార్ సీపీలో చేరిక

అల్లూరు: అల్లూరుపేటలోని అంజయ్యనాయుడు కాలనీ ప్రాంతానికి చెందిన టీడీపీ వర్గీయులు 20 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి సమక్షంలో ఆయన నివాసంలో టీడీపీని వీడి వైఎస్సార్‌సీపీలో చేరాయి. టీడీపీకి చెందిన వెంకటేశ్వర్లు, గోవిందు, నాగులు, శీనయ్య, వెంకటరమణయ్య, సునీల్, రాజేష్, రమేష్, బాలయ్య, ఈశ్వరయ్యకు వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలోస్థానిక నాయకుడు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

తండ్రి గెలుపు కోసం తనయుడి ప్రచారం



ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న అభినవ్‌రెడ్డి

సీతారామపురం: ఉదయగిరి ఎమ్మెల్యేగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని గెలిపించాలని కోరుతూ ఆయన తనయుడు అభినవ్‌రెడ్డి మంగళవారం సీతారామపురంలో స్థానిక నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. జగనన్న ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిపై ప్రజలకు వివరిస్తూ తన తండ్రికి అండగా నిలవాలన్నారు. మే 13న జరిగే ఎన్నికల్లో ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి, ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డిని ఫ్యాను గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. గుండుపల్లి, బోడసిద్ధాయపల్లి, ఓగూరువాండ్లపల్లి గ్రామాల్లో సర్పంచ్ చప్పిడి తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ మండల నాయకులు ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, మాజీ జెడ్పీటీసీ దుగ్గిరెడ్డి గురవారెడ్డి, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పీసీ అల్లూరురాజు, మండల పార్టీ కన్వీనరు చింతంరెడ్డి సుబ్బారెడ్డి, చిన్నాగంపల్లి, సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి సర్పంచ్‌లు రామచంద్రారెడ్డి, సంపూర్ణ, దుర్గాప్రసాద్, జేసీఎస్ కన్వీనరు మాబయ్య, వైఎస్సార్‌సీపీ నాయకులు రమణయ్య, ధనార్జన్, చంద్రమౌళి, యూత్ నాయకులు కనుమర్లపూడి పవన్‌కుమార్, పిడుగు నవీన్, సుధీర్, శ్రీహరి, తదితరులు పాల్గొన్నారు.

మానాన్నను గెలిపించండి..

- కుమార్తె, అల్లుడు ప్రచారం



కావలి: ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న రామిరెడ్డి కుమార్తె సంహిత రెడ్డి, అల్లుడు అఖిలేష్ రెడ్డి

కావలి: రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మూడోసారి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డిని గెలిపించాలని కుమార్తె సంహిత రెడ్డి, అల్లుడు అఖిలేష్ రెడ్డి స్థానిక నాయకులతో కావలి పట్టణంలో ఇంటింటికి తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. కావలి నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే ఎమ్మెల్యేగా ప్రతాప్‌కుమార్ రెడ్డిని, నెల్లూరు జిల్లా అభివృద్ధి చెందాలంటే ఎంపీగా వేణంబాక విజయసాయిరెడ్డి గెలిపించుకోవాలని కోరారు.

మళ్లీ సీఎంగా జగన్‌ను ఆశీర్వదించండి



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

దుత్తలూరు: పేదింటి భవిష్యత్‌ను మరింత గొప్పగా మార్చడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపిన సీఎం జగన్‌మోహన్ రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని జెడ్పీటీసీ లెక్కల లక్ష్మీకాంతమ్మ అన్నారు. మంగళవారం మండలంలోని బండకిందపల్లిలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి ఆధ్వర్యంలో ఇంటింటి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో జనసేన, బీజేపీతో టీడీపీ జట్టు కట్టి దొంగ హామీలిచ్చి ప్రజలను వంచించింది చంద్రబాబన్నారు. అదే చంద్రబాబు నేడు సూపర్ సిక్స్, ఆచరణ సాధ్యం కాని పథకాలంటూ మరోసారి ప్రజలను మోసం చేసేందుకు ముందుకు వస్తున్నారన్నారు. ఎంపీగా విజయసాయిరెడ్డి, ఎమ్మెల్యేగా రాజగోపాల్‌రెడ్డికి ఫ్యాను గుర్తుపై ఓట్లేసి అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. సొసైటీ అధ్యక్షుడు తుమ్మల వెంగయ్యచౌదరి, మండల ఎన్నికల ఇన్‌చార్జి హర్షవర్ధన్‌రెడ్డి, నాయకులు ఎల్‌పీ కొండారెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి, బ్రహ్మారెడ్డి, వల్లూరు వెంకటరెడ్డి, దొంతిరెడ్డి ఓబుల్‌రెడ్డి, సింగవరపు విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మన అభివృద్ధి జగనన్నతోనే సాధ్యం



కరపత్రాలు అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

వరికుంటపాడు: ప్రజలతో పాటు మన ప్రాంతం అభివృద్ధి చెందాలంటే జగనన్నదే సాధ్యమని మాజీ ఏఎంసీ చైర్మన్ అలిఅహ్మద్, పార్టీ మండల కన్వీనర్ మందలపు తిరుపతి నాయుడు ఓటర్లను కోరారు. త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరుతూ మంగళవారం రాత్రి మండలంలోని జడదేవిలో నాయకులు కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం చేసిన అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి రాజగోపాల్ రెడ్డి, విజయసాయి రెడ్డిలను గెలిపించాలని కోరారు. సంక్షేమ పాలన కోసం మళ్లీ జగనన్నకు మనమంతా అండగా నిలిచి సీఎంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్ మాగంటి శ్రీనివాసులు, నాయకులు చంచల మధు, కుందూరు కొండయ్య తదితరులు పాల్గొన్నారు

వైఎస్సార్‌సీపీ ఇంటింటి ప్రచారం



దేవలాలగడ్డలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న నిహారికారెడ్డి

ఉదయగిరి: ఉదయగిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి మేకపాటి రాజగోపాలరెడ్డి, ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి ఈ నెల 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాను గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరుతూ మేకపాటి నిహారికారెడ్డి ఉదయగిరిలోని తుఫాన్‌నగర్, దేవలాలగడ్డ షబ్బీర్ కాలనీల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. మండల అధ్యక్షుడు గానుగపెంట ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ కొండాయపాళెం, గంగిరెడ్డిపల్లి గ్రామాలలో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చేజర్ల సుబ్బారెడ్డి, ముర్తుజాహుస్సేన్, కె.రమణారెడ్డి, జి.శ్రీనివాసులురెడ్డి, తదితరులున్నారు.

క్లుప్తంగా

నేత్రపర్వం.. సీతారాముల కల్యాణం



చేజర్ల : మండలంలోని మడపల్లిలో ఉన్న కోదండరామస్వామి ఆలయ ప్రాంగణంలో సోమవారం రాత్రి సీతారాముల కల్యాణం నేత్రపర్వంగా జరిగింది. భక్తులు విశేషంగా తరలివచ్చి కల్యాణాన్ని వీక్షించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. చివరగా గ్రామోత్సవం ఘనంగా జరిగింది.

సన్మానం



సోమశిల : అనంతసాగరం మండలం లింగంగుంటలో ఉపాధ్యాయుడు పాపిశెట్టి నరసింహులు పదవీ విరమణ చేయడంతో ఆయన్ను మంగళవారం సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యుడు రాపూరు వెంకటసుబ్బారెడ్డి పాల్గొని సన్మానించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు పుల్లయ్య, అనంతసాగరం మండల కన్వీనర్ అన్వర్‌బాషా, మండల కమిటి సభ్యులు పాల్గొన్నారు.

పాతపాడులో వైద్య పరీక్షలు



చేజర్ల: మండలంలోని పాతపాడు ప్రాథమిక పాఠశాలలో ఆరోగ్య సురక్షలో భాగంగా మంగళవారం 240 మందికి వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేశారు. చేజర్ల పీహెచ్‌సీ వైద్యులు మెహతాబ్, షరీఫ్, సందీప్, సిబ్బంది పాల్గొన్నారు.

బీజేపీ నేతల ప్రచారం

ఆత్మకూరు : టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల గెలుపు కోసం ఆత్మకూరులో బీజేపీ నాయకులు మంగళవారం ప్రచారం నిర్వహించారు. పట్టణంలోని 3, 4 వార్డుల పరిధిలో కుడుముల సుధాకర్‌రెడ్డి, కె.సుధాకర్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి కరపత్రాలను అందజేశారు.

ఆంజనేయస్వామికి విశేష పూజలు



పొదలకూరు : పట్టణంలోని మారుతీనగర్‌లో ఉన్న వీర అభయాంజనేయస్వామికి అర్చకులు మంగళవారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం ఆకుపూజ, అభిషేకాలు, పూజలు, సాయంత్రం స్వామివారికి పల్లకిసేవ గావించారు.

వసతి గృహాల్లో దోమల మందు పిచికారీ



పొదలకూరు : పట్టణంలోని సచివాలయం బిట్–3 పరిధిలో ఉన్న వసతి గృహాల్లో పొదలకూరు కో–లొకేటెడ్ పీహెచ్‌సీ డాక్టర్ కిరణ్ రిషిత ఆధ్వర్యంలో మంగళవారం దోమల నివారణ మందును పిచికారీ చేశారు. డెంగీ, మలేరియా, ఫైలేరియా, చికెన్ గున్యా, మెదడువాపు వంటి వ్యాధులు దోమల ద్వారా సంక్రమిస్తాయని ఈ సందర్భంగా డాక్టర్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు మస్తాన్‌బీ, సహాయకులు కామాక్షమ్మ, వెంకటేశ్వర్లు, అరుణ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

ఘన సన్మానం



నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్పొరేట్ కార్యాలయంలో చీఫ్ జనరల్ మేనేజర్‌గా విధులు నిర్వర్తిస్తున్న నెల్లూరుకు చెందిన విజయ్‌కుమార్‌రెడ్డి మంగళవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ క్రమంలో ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈఈ శ్రీధర్, సీనియర్ అసిస్టెంట్ శివ ఆయనకు పుష్పగుచ్ఛాలను అందజేసి సత్కరించారు.

జగనన్న మేనిఫెస్టోపైనే ప్రజల్లో విశ్వాసం



ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

• ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

మర్రిపాడు : తెలుగుదేశం మేనిఫెస్టో కూటమి నేతలకు కూడా నచ్చడం లేదని, సీఎం జగనన్న ప్రవేశపెట్టిన మేనిఫెస్టోపైనే ప్రజలు విశ్వాసంతో ఉన్నారని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. మర్రిపాడు మండలంలోని కోనసముద్రం, డీసీపల్లి, ఖాన్‌సాహెబ్‌పేట, రామానాయుడుపల్లి, ఎస్సీ కాలనీ, రాంపల్లి గ్రామాల్లో ఆయన మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తొలుత డీసీపల్లిలోని గణపతి ఆలయం, రామాలయాల్లో విక్రమ్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ప్రతి ఇంటికీ వెళ్లి సంక్షేమ పథకాలను వివరిస్తూ ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యేకు స్థానిక ప్రజాప్రతినిధులు, నాయకులు ఘన స్వాగతం పలికారు. పూలవర్షం కురిపిస్తూ తమ అభిమాన నాయకుడికి ఆహ్వానం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమాన్ని రెట్టింపు చేస్తూ నూతన మేనిఫెస్టోను విడుదల చేశారని వివరించారు. రానున్న ఐదేళ్ల కాలంలో నియోజకవర్గాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానని హామీ ఇచ్చారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై కూడా ప్రత్యేక దృష్టి సారించినట్లు వివరించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కరోనా సమయంలో కూడా విస్తృతంగా సేవలు అందించామని, టీడీపీ నాయకులు అసలు కనిపించలేదన్నారు. గతంలో జరిగిన ఐఏబీ సమావేశంలో ఆత్మకూరు రైతాంగానికి సాగునీరు ఇవ్వకుండా ప్రతిపక్ష అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ప్రయత్నం చేశారని, ఆ సమావేశం అనంతరం సీఎం జగనన్నను కలిసి విన్నవించడంతో ఆరు టీఎంసీల నీటిని విడుదల చేశారని పేర్కొన్నారు. దీంతో రైతులు సుభిక్షంగా పంటలు పండించుకున్నారని పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గంలో హైలెవల్ కెనాల్, నడికుడి శ్రీకాళహస్తి రైల్వే పనులు పూర్తి చేస్తామని జగనన్న మాట ఇచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ బొర్రా సుబ్బిరెడ్డి, మాజీ కన్వీనర్ గంగవరపు శ్రీనివాసులునాయుడు, అంబటి కృష్ణారెడ్డి, సర్పంచ్ రేవూరు సుప్రజ, ఎంపీటీసీ పేర్నాటి దొరసానమ్మ, పార్టీ నేతలు కంచర్ల కన్నపనాయుడు, వెన్నపూస చెన్నకృష్ణారెడ్డి, సంగన నరసారెడ్డి, సురేంద్ర, రేవూరు గోపాల్‌రెడ్డి, కాశీరెడ్డి, పెదరాయుడు, కృష్ణారెడ్డి, చెవుల శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు

మర్రిపాడు : ఆత్మకూరు నియోజకవర్గంలో పలు పార్టీల నుంచి వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు జరిగాయి. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని మేకపాటి నివాసంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మంగళవారం వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని ఒకటో వార్డు నరసాపురంలో పోలంరెడ్డి హజరత్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య, పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనందరెడ్డి ఆధ్వర్యంలో పలువురు పార్టీలో చేరారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలో చిన్నమాచనూరు సర్పంచ్ కటకం నరసింహారావు, గుంటుపల్లి రమేష్ నాయుడు ఆధ్వర్యంలో నాగరాజుపాడుకు చెందిన పలువురు నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఏఎస్‌పేట మండలం గుంపర్లపాడు నేత సిరిగిరి వెంకటేశ్వర్లు రెడ్డి, సర్పంచ్ రంగారెడ్డి, ఎంపీటీసీ స్వాతి ఆధ్వర్యంలో 30 మైనారిటీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరాయి. ఈ సందర్భంగా ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి వారితో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విజయం కోసం కృషి చేయాలని కోరారు.



మర్రిపాడు : పార్టీలో చేరిన వారిని ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి

50 మంది చేరిక

ఆత్మకూరురూరల్: మండలంలోని కరటంపాడుకు చెందిన టీడీపీ మైనార్టీ నాయకులతో పాటు పంచాయతీ వార్డు మెంబర్ జ్యోతి వెంగయ్య, తదితర 50 మంది మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మండల జేసీఎస్ కన్వీనర్ వల్లభనేని రాజేంద్ర ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పఠాన్ ఫరీద్, అల్తాఫ్, సాబ్‌జాన్, జీలు, పట్నం చంద్రమౌళి, వెంకటేశ్వర్లు, మాధవరావు, పెంచలయ్య తదితరులు బ్రాహ్మణపల్లిలోని ఎమ్మెల్యేని కలిసి పార్టీలో చేరారు.

60 కుటుంబాల చేరిక

సోమశిల : అనంతసాగరానికి చెందిన 60 టైలర్స్ కుటుంబాల వారు మంగళవారం ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీ నేత బట్రెడ్డి జనార్దన్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మేకపాటి వారిని పార్టీలోకి ఆహ్వానించారు.



సోమశిల : పార్టీలో చేరిన వారితో ఎమ్మెల్యే మేకపాటి

• అనంతసాగరం మండలం బొమ్మవరంలో ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ప్రచారంలో స్థానిక నేత కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో చిలకలమర్రికి చెందిన టీడీపీ మాజీ ఉప సర్పంచ్ రమణయ్య మరో 20 కుటుంబాలతో కలిసి సోమవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. దీంతో పాటు సీనియర్ నేత ఉరిబిండి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చాపురాళ్లపల్లికి చెందిన సన్నపురెడ్డి వెంకటేశ్వర్లు రెడ్డి పార్టీలో చేరారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్ష్మీదేవి, పి.శేఖర్‌రెడ్డి, కె.శేఖర్, ప్రేమ్‌కుమార్, ఆర్.మాల్యాద్రి, కె.పెంచలరెడ్డి తదితరులు ఉన్నారు.



ఆత్మకూరురూరల్: వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు



సోమశిల : వైఎస్సార్‌సీపీలో చేరిన టైలర్స్ కుటుంబాలు

పేదల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం



దర్గా లోపలికి వెళ్తున్న సునందారెడ్డి, నేహారెడ్డి, మణిమంజరి

అనుమసముద్రంపేట : పేదల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పనిచేసిందని, మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అవకాశం ఇవ్వాలని వైఎస్సార్‌సీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి సతీమణి సునందారెడ్డి, కుమార్తె నేహారెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి తల్లి మణిమంజరి అన్నారు. మండలంలోని గుంపర్లపాడు, మదారాబాద్, శ్రీకొలను గ్రామాల్లో వారు మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం గుంపర్లపాడులో కరపత్రాలు పంపిణీ చేసి మాట్లాడారు. అన్నివిధాలుగా జిల్లా అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఇప్పటికే రాష్ట్రంలో ఎంతో మంది పేదలకు సంక్షేమ పథకాలను అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం కృషి చేసిందన్నారు. విజన్ ఉన్న నాయకుడిగా జగన్‌మోహన్‌రెడ్డి గుర్తింపు తెచ్చుకున్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్ పందిళ్లపల్లి సుబ్బారెడ్డి, ఎంపీపీ బోయళ్ల పద్మజారెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు పందిళ్లపల్లి రాజేశ్వరమ్మ, మండల కో–ఆప్షన్ సభ్యుడు సయ్యద్ సందాని, జేసీఎస్ కన్వీనర్ పులిమి రమేష్‌రెడ్డి, రాజవోలు సొసైటీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కోటిరెడ్డి, బోయళ్ల చెంచురెడ్డి, గోడా భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజా సమస్యల పరిష్కారానికి విక్రమ్‌రెడ్డి కృషి చేస్తారని నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి అన్నారు. మదారాబాద్ ఎస్సీ కాలనీలో స్థానిక సమస్యలను పలువురు ఆమె దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై నేహారెడ్డి స్పందిస్తూ మరో రెండు నెలల్లో ప్రజలకు అవసరమైన తాగునీటి వాటర్ ప్లాంట్‌లను ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి ఏర్పాటు చేస్తారని, ఇప్పటికే విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేశామని, ఎన్నికలు పూర్తయ్యాక వాటి పనులను పునరుద్ధరించి ప్రజలకు విద్యుత్ సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి



ప్రజలతో మాట్లాడుతున్న సీఐ

• సీఐ రవినాయక్

అనుమసముద్రంపేట : ప్రజలు ధైర్యంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సంగం సీఐ రవినాయక్ తెలిపారు. ఏఎస్‌పేట మండలంలోని హసనాపురం, జమ్మవరం గ్రామాల్లో మంగళవారం ఆయన ప్రజలతో మమేకమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. గ్రామాల్లో అనధికారికంగా మద్యం దుకాణాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రశాంతంగా ఎన్నికలు జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల సమయంలో అవాంఛనీయ ఘటనలకు పాల్పడితే చర్యలు తప్పవని వెల్లడించారు. ఆయన వెంట పోలీసు సిబ్బంది ఉన్నారు.

3 నుంచి హోమ్ ఓటింగ్



నెల్లూరు(బారకాసు): హోమ్ ఓటింగ్‌ను 3వ తేదీ నుంచి ఈ నెల ఏడో తేదీ వరకు నిర్వహించనున్నామని, ప్రక్రియను పటిష్టంగా చేపట్టాలని నెల్లూరు సిటీ నియోజకవర్గ ఆర్వో వికాస్ మర్మత్ పేర్కొన్నారు. కార్పొరేషన్ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ విభాగంలో ఎన్నికల సెక్టార్ అధికారులతో మంగళవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. సిటీ పరిధిలో 160 మంది ఓటర్లు హోమ్ ఓటింగ్ ప్రక్రియలో పాల్గొననున్నారని తెలిపారు. ప్రక్రియ నిర్వహణకు అవసరమైన రూట్ మ్యాప్‌ను సిద్ధం చేయాలని సూచించారు. ఐదుగురు ఎన్నికల అధికారులకు సెక్టార్ల వారీగా బాధ్యతలను అప్పగించామని వివరించారు.

మేలు చేసిన ప్రభుత్వాన్ని ఆశీర్వదించండి



ఆత్మకూరులో కరపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు



సోమశిల : ఇంటింటి ప్రచారం చేస్తున్న నాయకులు



సంగం : ప్రచారంలో నాయకులు

ఆత్మకూరు : ఐదేళ్లుగా అన్నివర్గాలకు సంక్షేమ ఫలాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీని మరోసారి ఆశీర్వదించాలని పార్టీ నాయకులు కోరారు. పట్టణంలోని రెండో వార్డు, 17వ వార్డుల్లో పార్టీ పట్టణాధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ ఆదిశేషయ్య ఆధ్వర్యంలో మంగళవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కరపత్రాలు అందజేసి ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని, ఎంపీ అభ్యర్థిగా వేణుంబాక విజయసాయిరెడ్డిని గెలిపించాలని కోరారు. పలు ఇళ్ల వద్ద లబ్ధిదారులు జగనన్న ప్రభుత్వంలోనే తమకు సంక్షేమ పథకాలు అందాయని తమ అనుభవాన్ని పంచుకున్నారు. కార్యక్రమంలో పార్టీ నేతలు ఐవీ రమణారెడ్డి, నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కౌన్సిలర్లు పి.పెంచలయ్య, మహబూబ్‌బాషా, శివకోటారెడ్డి, సమద్, బి.మస్తాన్, మన్సూర్, షాబుద్దీన్, తోడేటి మణి, కొండా వెంకటేశ్వర్లు, కేతా రవి, వెంకట సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, జమీర్, రిజ్వాన్, మస్తాన్, ఆసీఫ్ తదితరులు పాల్గొన్నారు.

సోమశిల గ్రామంలో..

సోమశిల: అనంతసాగరం మండలం సోమశిల గ్రామంలో నాలుగు రోజులుగా వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రచారం చేస్తున్నారు. నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బట్రెడ్డి పోలిరెడ్డి, సిద్ధన పెంచలరెడ్డి, చింతమ రామిరెడ్డి, రమణారెడ్డి, ఈశ్వరయ్య, మహబూబ్‌బాషా, వెంకటరమణ, కాలేషా, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా..

సంగం : మండల కేంద్రమైన సంగం రాళ్లచెలిక, మిక్స్‌డ్ కాలనీల్లో వైఎస్సార్‌సీపీ మాజీ మండల కన్వీనర్ కంటాబత్తిన రఘునాథరెడ్డి, సర్పంచ్ నిమ్మల రమణమ్మ మంగళవారం ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రానికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. వారి వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

తరుణవాయి, దువ్వూరు గ్రామాల్లో..

సంగం : మండలంలోని తరుణవాయి, దువ్వూరు గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. తరుణవాయి గ్రామంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు తుంగా ఇందూదర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతి ఇంటికీ వెళ్లి కరపత్రాలు అందజేస్తూ ఎమ్మెల్యేగా విక్రమ్‌రెడ్డిని, ఎంపీగా విజయసాయిరెడ్డికి గెలిపించాలని అభ్యర్థించారు. అదే విధంగా దువ్వూరులో పీఏసీఎస్ అధ్యక్షుడు సూరి మదన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ నాయకులు కొల్లి శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు దేవసహాయం, దేవ వరమ్మ, వెంకటేశ్వర్లు ఉన్నారు.

ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలి

ఆత్మకూరురూరల్ : ప్రతి ఒక్కరూ ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని మండల జేసీఎస్ కన్వీనర్ రాజేంద్ర పేర్కొన్నారు. మండలంలోని చెర్లోయడవల్లి, రావులకొల్లు గ్రామాల్లో ఆత్మకూరు అభ్యర్థి మేకపాటి విక్రమ్‌రెడ్డి, నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణుంబాక విజయసాయిరెడ్డికి మద్దతుగా మంగళవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆత్మకూరు, బట్టేపాడు సొసైటీ అధ్యక్షులు సానా వేణుగోపాల్‌రెడ్డి, బొమ్మిరెడ్డి రవికుమార్ రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షుడు వాసిపల్లి లక్ష్మీరెడ్డి, వైస్ ఎంపీపీ ప్రమీల, మహిళా నేతలు తోడేటి భాగ్యమ్మ, సర్పంచ్‌లు మాలేపాటి సతీష్, బొలిగర్ల వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ పిన్నంరెడ్డి కోదండ రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెన్నైలో ప్రచారం

ఆత్మకూరురూరల్ : మండలంలోని ఆరవేడు పంచాయతీకి చెందిన పలువురు గ్రామస్తులు బతుకుదెరువు కోసం చెన్నైలో ఉండగా స్థానిక సర్పంచ్ ప్రసాద్‌రెడ్డి మంగళవారం వారిని కలిసి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రచారం నిర్వహించారు. నెల్లూరు ఎంపీగా వేణుంబాక విజయసాయిరెడ్డిని, ఆత్మకూరు ఎమ్మెల్యేగా మేకపాటి విక్రమ్‌రెడ్డిని గెలిపించుకునేందుకు ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని కోరారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గోపిరెడ్డి ఖాజారెడ్డి, వార్డు సభ్యులు కరేటి పెంచలరెడ్డి, మస్తాన్‌రెడ్డి, మాధవరెడ్డి వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరురూరల్ : చెన్నైలో ప్రచారం చేస్తున్న నాయకులు



సంగం : తరుణవాయిలో..



ఆత్మకూరురూరల్ : చెర్లోయడవల్లిలో..

ఆరుతడి పంటలను సాగు చేయాలి



మాట్లాడుతున్న ఏడీఏ మారుతీదేవి

పొదలకూరు : నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు ఆరుతడి పంటల సాగు చేయాలని రైతుశిక్షణ కేంద్రం నెల్లూరు ఏడీఏ సి.మారుతీదేవి సూచించారు. మండలంలోని పొదలకూరు, మరుపూరు, ఇనుకుర్తి, బిరదవోలు గ్రామాల్లో రైతులకు మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సీజన్‌లో బోర్ల కింద వరికి ప్రత్యామ్నాయంగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాల్సిందిగా పేర్కొన్నారు. మొక్కజొన్న, సజ్జ, వేరుశనగ, నువ్వు, పెసర, మినుము పంటలను సాగు చేసుకుంటే ఫలసాయం అందుతుందన్నారు. ఈ పంటలకు వరి కంటే ఆరురెట్లు తక్కువ నీటి అవసరం ఉంటుందన్నారు. ఈ సమావేశాల్లో ఏఓలు యు.గీతాకుమారి, శైలజా, చక్రవర్తి, ఈఏఓ వై.నాయక్, వీఏఏ చంద్రశ్రీ, గోవర్ధన్, సాయిగణేష్, శివ పాల్గొన్నారు.

ఓఆర్ఎస్‌ను అందుబాటులో ఉంచాలి

కొడవలూరు : ఎండల తీవ్రత అధికంగా ఉన్న నేపథ్యంలో పీహెచ్‌సీలో తగినన్ని ఓఆర్ఎస్ ప్యాకెట్‌ల నిల్వలు ఉంచాలని ఫ్యామిలీ డాక్టర్ జిల్లా ప్రోగ్రామింగ్ ఆఫీసర్ డాక్టర్ దయాకర్ సూచించారు. కొడవలూరు పీహెచ్‌సీని మంగళవారం ఆయన ఆకస్మికంగా సందర్శించి రికార్డులు పరిశీలించారు. ఓఆర్ఎస్ ప్యాకెట్‌లను ఉపకేంద్రాల్లో సైతం అందుబాటులో ఉంచాలన్నారు. ఎండల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్ర సిబ్బంది ద్వారా గ్రామాల్లో అవగాహన కలిగించాలని చెప్పారు. ఆయా తేదీల్లో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహిస్తున్నారా లేదా అని ఆరా తీసి సంతృప్తి వ్యక్తం చేశారు. ప్రోగ్రామింగ్ ఆఫీసర్ వెంట వైద్యాధికారి జి.బాలచంద్రబాబు, సీహెచ్ఓ టి.సోమశేఖర్, హెచ్ఏ షఫీఉద్దీన్, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది ఉన్నారు.